'సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి'

ఖమ్మం, మార్చి 4: సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని జర్మన్ కమ్యూనిస్టు పార్టీ (ఎంఎల్) పీడీ నాయకురాలు సుష అన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆలిండియా యూనిటీ మహాసభలు ఖమ్మంలోని(డీవీకే, భాస్కర్ నందినగర్) భక్త రామదాసు కళాక్షేత్రంలో సోమవారం ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభ సూచకంగా పీసీసీ సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ కార్యదర్శి సుభాష్ దేవ్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించగా.. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆహ్వానం పలికారు. మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది వడ్డెల్లి కృష్ణమూర్తి సందేశం ఇచ్చి.. ప్రతినిధులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుష ప్రసంగిస్తూ పోరాట పటిమను మరింతగా ప్రదర్శించేందుకు విప్లవ పార్టీలు ఏకమై మాస్‌లైన్‌గా ముందుకెళ్లడం గొప్ప విషయమని పేర్కొన్నారు. నేపాల్ కమ్యూనిస్టు పార్టీ(మసాల్) కేంద్ర నాయకుడు ఠాగూర్ కనాల్ మాట్లాడుతూ.. మూడు విప్లవ పార్టీలు కలిసి ఒకే పార్టీగా ఆవిర్భవించడం అంతర్జాతీయ ముఖచిత్రంలో మంచి పరిణామమని చెప్పారు. మహాసభలు ప్రారంభానికి ముందు ప్రతినిధులు అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. వేదికపై యూనిటీ మహాసభల ఆర్గనైజింగ్ నాయకులు ప్రదీప్‌సింగ్ ఠాగూర్, పోటు రంగారావు, సుభాష్‌దేవ్, సంజయ్‌సింగ్ వీ, దేవత శర్మ, కే రమ, కేజీ రామచందర్, రిషి ఆశీనులయ్యారు.

చెట్టును ఢీకొన్న కారు.. ఐదుగురు మృతి

- శుభకార్యానికి వెళ్తూ అనంతలోకాలకు
- ఆరుగురికి తీవ్రగాయాలు.. డ్రైవర్ నిద్రమత్తే కారణం
- మృతులది కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా

వనపర్తి జిల్లా కొత్తకోట వద్ద చెట్టును ఢీకొట్టిన కారు

కొత్తకోట, మార్చి 4 : పెండ్లి తేదీ ఖరారు చేసుకునేందుకు వెళ్తూ ఐదుగురు మృత్యువాత పడిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా బసవన్నకుంటకు చెందిన అలీకి హైదరాబాద్‌లోని బండ్లగూడకు చెందిన యువతితో పెండ్లి నిశ్చయం కాగా, నిశ్చితార్థానికి 12 మందితో కలిసి ఆదివారం రాత్రి కారు (కేఏ34 పీ7323)లో హైదరాబాద్‌కు బయలుదేరారు. డ్రైవర్ అలీ నిద్రమత్తులో ఉండడంతో కొత్తకోట సమీపంలోని టెక్కాలయ దర్గా వద్ద 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న చెట్టును కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోషిణి (4), రుమానా (2), వాసిఫారిఫాత్ (7 నెలలు), సలీమాబీ(95), అబ్దుల్ రెహమాన్ (39) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆరుగురు (షఫీ, హసన్, ఖదీర్, అలీ, హబీబా, షాజహానా) తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. కారులో 12 మంది ఉండగా ఏడేండ్ల సమీరా అనే చిన్నారికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రులను చికిత్స కోసం కర్నూల్ దవాఖానకు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ఏరియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఎస్పీ రక్షితమూర్తి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కేఎస్ రత్నం తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి

మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ దవాఖాన కార్మికులు ధర్నా చేపట్టారు. దవాఖానలో కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీని తొలగించి, కార్మికులను కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ప్రభుత్వ దవాఖాన శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు పాల్గొన్నారు.
-కరీంనగర్ కలెక్టరేట్

మహిళా సంఘాలకు యూనిఫారాలు కుట్టే బాధ్యత

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సర్కారు స్కూళ్లలోని విద్యార్థులకు ఉచితంగా అందించే యూనిఫారాలను కుట్టించే బాధ్యతను విద్యాశాఖ మహిళా సంఘాలకు అప్పగించింది. మొత్తం యూనిఫారాలను కుట్టే బాధ్యతను స్వయం సహాయక బృందాలకు అప్పగించింది. 2024-25 విద్యా సంవత్సరంలో మొత్తం 21,19,439 విద్యార్థులకు 42,38,878 జతల యూనిఫారాలను అందజేస్తారు. ఒక జతకు రూ.50 కుట్టుకూలీగా చెల్లిస్తారు. రాష్ట్రంలోని సర్కారు, ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాలు, కేజీబీవీలు, మాడల్ స్కూళ్లు, యూఆర్ఎస్, ఎయిడెడ్ స్కూళ్లలోని విద్యార్థులకు పాలిస్టర్ వస్త్రంతో రూపొందించిన ఉచిత యూనిఫారాలు అందజేస్తారు. స్వయం సహాయక బృందాలను జిల్లా కలెక్టర్లు ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియ మార్చి 15 లోపు పూర్తిచేయాలని విద్యాశాఖ గడువుగా విధించింది. మార్చి 31 లోపు విద్యార్థుల కొలతలు తీసుకుంటారు. జూన్ 1లోపు యూనిఫారాలు కుట్టడం పూర్తిచేయాలని ఆదేశించింది.

విద్యార్థులు, జతల వివరాలిలా..

	విద్యార్థులు	జతలు
బాలురు	10,12,575	20,25,150
బాలికలు	11,06,864	22,13,728
మొత్తం	21,19,439	42,38,878

హరేకృష్ణ హెరిటేజ్ టవర్ ప్రాజెక్టుకు విరాళం

కోకాపేటలో 6ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న హరేకృష్ణ హెరిటేజ్ టవర్ ప్రాజెక్టు కోసం బంజారాహిల్స్ రోడ్ నం.12లోని సంస్థ కార్యాలయంలో సోమవారం హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యచంద్ర గౌరదాసకు రూ.22లక్షల చెక్కును అందజేస్తున్న నర్సింగ్ క్లాత్ అధినేత సంజయ్ సింఘానియా
- బంజారాహిల్స్, మార్చి 4

తెలంగాణలో తగ్గిన చిరుతల సంఖ్య

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చిరుత పులుల సంఖ్య తగ్గినట్టు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) వెల్లడించింది. అడవుల్లోని జాతీయ రహదారులపై వాహనాలు ఢీ కొట్టడం వల్ల, అడవుల్లో వేటగాళ్లు అమర్చిన ఉచ్చులు, విద్యుత్తు వైర్ల వల్ల, స్థానికుల దుశ్చర్యల వల్ల చిరుతల సంఖ్య తగ్గుతున్నట్టు 2022 స్థితిగతుల నివేదికలో స్పష్టం చేసింది. 2018 నాటికి తెలంగాణలో 334 చిరుత పులులు ఉండగా.. 2022లో వాటి సంఖ్య 297కు తగ్గిందని, ఇదే సమయంలో ఏపీలో చిరుతల సంఖ్య 492 నుంచి 569కి పెరిగిందని తెలిపింది. తెలంగాణలో చిరుతల సంఖ్య తగ్గడంపై రాష్ట్ర అటవీ శాఖ సీనియర్ అధికారిని ప్రశ్నించగా.. ఎన్‌టీసీఏ నివేదికను, చిరుతల సంఖ్యను అంచనా వేసేందుకు అనుసరించిన పద్ధతిని లోతుగా పరిశీలించిన తర్వాతే వాస్తవ కారణాలు తెలుస్తాయని చెప్పారు. ఏది ఏమైనప్పటికీ తెలంగాణలో గత కొంత కాలం నుంచి చిరుతల మరణాలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే రెండు చిరుతలు (రంగారెడ్డి జిల్లాలో ఒకటి, నారాయణపేట జిల్లాలో మరొకటి) చనిపోయాయి. దీంతో రాష్ట్రంలో చిరుతల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరమున్నదని ఎన్‌టీసీఏ స్పష్టం చేసింది.

పాల ఉత్పత్తిని పెంచాలి: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో డిమాండ్‌కు తగ్గట్టు పాల ఉత్పత్తి జరగడం లేదని, పాడి ఉత్పత్తి పెంచాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం హైదరాబాద్ హైటెక్స్‌లో 50వ డెయిరీ ఇండస్ట్రీ కాన్ఫరెన్స్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పాడి పరిశ్రమకు మంచి అవకాశాలున్నాయని తెలిపారు. పాడి ఉత్పత్తిలో తెలంగాణను నంబర్ వన్‌గా నిలిపేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ రంగ పాడి పరిశ్రమలు అభివృద్ధి చెందాల్సిన అవసరముందని పేర్కొన్నారు. పాడి ఉత్పత్తిలో మహిళలు రాణించాలని, ఇందులో భాగంగానే మధిర నియోజకవర్గంలో పాడి పరిశ్రమ నెలకొల్పేందుకు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేకంగా చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. డ్వాక్రా సంఘం మహిళలకు ఇంటికి ఒక బర్రె, ఆవును ఇచ్చి ఇందిర డెయిరీ ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

సదాలక్ష్మి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, మార్చి 4: తెలంగాణ తొలిదశ ఉద్యమ నాయకురాలు, మాజీ డిప్యూటీ స్పీకర్ సదాలక్ష్మి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా క్రియాశీలక రాజకీయాల్లో రాణించిన సదాలక్ష్మి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్ ఏర్పాటు చేస్తామని గతంలో హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బంగారు శ్రీను, పాలడుగు శ్రీనివాస్, కొల్లూరి వెంకట్, శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

85 ఏండ్లు ఉంటేనే ఇంటి వద్ద ఓటు

నిబంధన సడలించిన కేంద్రం

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : ఇంటి వద్ద ఓటు వేసే అర్హత వయస్సును 80 ఏండ్ల నుంచి 85 ఏండ్లకు కేంద్ర ప్రభుత్వం పెంచింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల నుంచి ఈ నిబంధన అమల్లోకి వస్తుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఈ మేరకు 85 సంవత్సరాలు, ఆ పైన వయస్సు ఉన్న వారే హోం ఓటింగ్ దరఖాస్తుకు అర్హులని సోమవారం సీఈవో వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

తాడి కార్పొరేషన్‌కు రూ.15 కోట్లు

హైదరాబాద్, మార్చి4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తాడి టాపర్స్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.15 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వం కార్పొరేషన్‌కు రూ.30 కోట్లను కేటాయించగా, అందులో 15 కోట్లను విడుదల చేసింది.

జూన్ వరకు బొగ్గు దిగుమతి ఒప్పందాలు

రాష్ట్రాలు, థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు కేంద్రం సూచన

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): విదేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకునేందుకు కుదుర్చుకున్న ఒప్పందాలు జూన్ వరకు కొనసాగేలా చూసుకోవాలని, దేశంలోని అన్ని థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో 6% విదేశీ బొగ్గును బ్లెండ్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వాలకు, వాటి ఆధ్వర్యంలో నడిచే థర్మల్ విద్యుత్తు కేంద్రాల సీఎండీలకు కేంద్ర ఇంధన శాఖ ఓ సర్క్యులర్‌ను జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య దేశంలో విద్యుత్తు డిమాండ్ 250 గిగావాట్లకు చేరే అవకాశమున్నదన్న అంచనాల నేపథ్యంలో ఈ సర్క్యులర్‌ను జారీ చేసిన కేంద్రం.. థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో 6% విదేశీ బొగ్గును వాడాలన్న ఆదేశాలను కూడా జూన్ వరకు పొడిగిస్తున్నట్టు స్పష్టం చేసింది.

ప్రేమించాలని వేధింపులు.. యువకుడి హత్య

మల్యాల, మార్చి 4: ఒకే సామాజిక వర్గం.. దూరపు బంధువైన ఓ యువతిని ప్రేమించాలని వేధించిన ఘటనలో యువకుడు యువతి కుటుంబసభ్యుల చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. యువకుడు కత్తితో దాడి చేయగా యువతి కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లిలో జరిగింది. పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన భోగ మహేశ్(25) వెల్డింగ్ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అతనికి దూరపు బంధువు అయిన మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందిన ఓ యువతిని ప్రేమించాలని వేధించడంతో ఆమె కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు ఇటీవలే మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా.. మహేశ్‌లో మార్పు రాలేదు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తక్కళ్లపల్లిలోని యువతి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో కొద్దిసేపు మహేశ్‌కు, యువతి కుటుంబ సభ్యులకు వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మహేశ్ వెంట తెచ్చుకున్న కత్తితో యువతి తాత నర్సయ్యను ఛాతీలో పొడిచాడు. యువతి తల్లి భైరి సత్తవ్వ తొడపై, యువతి తమ్ముడు మనోజ్ చేతిపై పొడిచాడు. అప్రమత్తమైన ఆమె కుటుంబ సభ్యులు ప్రతిఘటించి బండరాయితో మహేశ్ తలపై బాదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘర్షణలో తీవ్రంగా గాయపడిన యువతి కుటుంబ సభ్యులను స్థానికులు 108 ద్వారా జగిత్యాల ఏరియా దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న మల్యాల సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై అబ్దుల్‌రహీం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ జగిత్యాల ఏరియా దవాఖానకు వెళ్లి క్షతగాత్రులను, మృతదేహాన్ని పరిశీలించారు. ఇరు కుటుంబాల సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు మల్యాల సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు.

నీళ్ల కోసం వచ్చి.. బావిలోపడ్డ దుప్పి

సురక్షితంగా బయటకు తీసిన ఫారెస్ట్ అధికారులు



కోనరావుపేట, మార్చి 4: అటవీ ప్రాంతం నుంచి నీళ్ల కోసం వచ్చి ప్రమాదావశాత్తు బావిలో పడిన చుక్కల దుప్పిని ఫారెస్ట్ అధికారులు సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్రిమడ్లలో సోమవారం చోటుచేసుకున్నది. దాహం తీర్చుకునేందుకు అటవీ ప్రాంతం నుంచి ఓ చుక్కల దుప్పి ఆకుల రాజేశం అనే రైతు వ్యవసాయ బావి దగ్గరికి వచ్చింది. నీళ్లు వెతికే క్రమంలో కాలుజారి బావిలో పడింది. అటుగా వెళ్లిన ఓ వ్యక్తి గమనించి గ్రామస్థులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలానికి చేరుకున్న ఎఫ్ఎస్‌వో ఆయూబ్‌ఖాన్ గ్రామస్థులతో కలిసి తాళ్ల సహాయంతో దుప్పిని సురక్షితంగా బయటకు తీశారు. తర్వాత అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఎఫ్ఎస్‌వో వెంట బీట్ ఆఫీసర్ శ్రీశైలం, తదితరులు ఉన్నారు.

గట్టమ్మపై గెట్టు పంచాయితీ

- పట్టు కోసం నాయక్‌పోడ్‌లు, ముదిరాజ్‌ల ఘర్షణ
- ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు

జాకారం గ్రామస్థులకు నచ్చజెబుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

ములుగు రూరల్, మార్చి 4 : ములుగు జిల్లా కేంద్రంలోని మొదటి మొక్కుల తల్లి గట్టమ్మ దేవాలయంపై గెట్టు పంచాయితీ ముదిరింది. గట్టమ్మ తల్లి సాక్షిగా సోమవారం ఆలయం వద్ద జాకారం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్థులు, గ్రామస్థులు, ములుగు ఆదివాసీ నాయక్‌పోడ్ పూజారుల మధ్య ఘర్షణ జరిగింది. డీఎస్పీ రవీందర్, ములుగు, పస్రా సీఐలు మేకల రంజిత్‌కుమార్, శంకర్, ములుగు, వెంకటాపూర్, పస్రా ఎస్సైలు వెంకటేశ్వర్, చల్లా రాజు, మస్తాన్ ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండగానే ఘర్షణ చోటు చేసుకుంది. పరిస్థితి చేజారకుండా ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టారు.

మేమే పూజారులం : నాయకపోడులు

70, 80 ఏండ్ల నుంచి ఆదివాసీ నాయక్‌పోడ్‌లు గట్టమ్మకు పూజారులుగా కొనసాగుతున్నారని ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్, పూజారులు తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం కొందరు జాకారం పరిధి అని చెప్పి గొడవలు సృష్టించారని గుర్తు చేశారు. 2015లో పూర్తి హక్కులు తమకేనని కోర్టులో తీర్పు వచ్చిందని తెలిపారు. గట్టమ్మ వద్ద పూజలో ఉన్న తమపై జాకారం గ్రామ ముదిరాజ్‌లు, గ్రామస్థులు దాడి చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

కోర్టు ఆర్డర్ ఉంది : ముదిరాజ్‌లు

హైకోర్టు ఆర్డర్ ప్రకారం గట్టమ్మ దేవాలయం తమకే చెందిందని ముదిరాజ్ పూజారుల పరస్పర సహకార సంఘం అధ్యక్షుడు ఈర్ల చేరాలు, సభ్యులు తెలిపారు. 1953 నుంచి తామే గట్టమ్మ పూజారులమని, గట్టమ్మ వద్ద గుడి, గద్దెలను కట్టించింది కూడా తామేనని చెప్పారు. 2016లో కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్రస్తుతం తాము గట్టమ్మ దేవాలయానికి వచ్చినట్లు తెలిపారు.

'అమరరాజా'ను తరలించాలి

- నీరు, గాలి కాలుష్యమయ్యే ప్రమాదం ఉంది
- మాయమాటలు చెప్పి భూములు కొనుగోలు చేస్తున్నారు
- మహబూబ్‌నగర్ ఐటీ పార్కులోని కంపెనీ వద్ద ఆందోళన
- నేడు కలెక్టర్‌ను కలవనున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు

ఆందోళన చేస్తున్న ఐటీపార్కు చుట్టుపక్క గ్రామస్తులు

మహబూబ్‌నగర్, మార్చి 4 : కంపెనీ ఏర్పాటు చేస్తే ప్రతి ఒక్కరికీ ఉపాధి లభిస్తుందని, ఎవరికీ ఎలాంటి హాని జరగదని హామీ ఇచ్చి ఇప్పుడు మరిన్ని భూములు కావాలంటూ తమపై ఒత్తిడి చేయడం ఎంత వరకు సమంజసమని పలు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం శివారులోని దివిటిపల్లి వద్ద ఉన్న ఐటీ పార్కులో నిర్మిస్తున్న అమరరాజా లిథియం కంపెనీ వద్దకు దివిటిపల్లి, ఎదిర, అంబటిపల్లి, సిద్దాయపల్లి గ్రామాలకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, చిన్నకృష్ణతోపాటు పలువురు మహిళలు చేరుకొని పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీ ఏర్పాటుకు ముందు నిర్వాహకులు మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్ల మున్సిపాలిటీలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారని, కానీ ఇప్పుడు కంపెనీ చుట్టుపక్కల పొలాలు ఉన్న రైతుల వద్దకు వచ్చి మీ భూమి ఎందుకూ పనికి రాదని, ఎప్పటికైనా మాకే అమ్మక తప్పదని మాయమాటలు చెప్పి కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది రైతులు భూమినే నమ్ముకుని జీవిస్తున్నారని, కంపెనీ పనులు చేపట్టి కొన్ని రోజులే అయినందున ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో నీరు, గాలి కలుషితం అయ్యే అవకాశాలున్నాయని, కంపెనీని తరలించే వరకు ఆందోళన చేపడుతామని భీష్మించుకూర్చున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కంపెనీ వద్దకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడినప్పటికీ వినకపోవడంతో పోలీసులు ఆర్డీవో, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరావుకు విషయాన్ని తెలిపారు. కొద్దిసేపు పోలీసులు, నిరసనకారుల మధ్య వాగ్వాదం జరుగగా, కలెక్టర్‌ను కలుద్దామని చెప్పడంతో ఆందోళనకారులు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఏవోను కలిసి సమస్యను వివరించారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు కలుస్తానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో గ్రామస్థులు వెనుదిరిగారు.

పోలీసు పాలన 'హస్త'వ్యస్తం

- ఐపీఎస్, డీఎస్పీల పోస్టింగ్‌లలో గందరగోళం
- ఎప్పుడు ఎక్కడికి వెళ్లాల్సి వస్తుందో తెలియక అయోమయం
- నెలలో రెండుమూడు బదిలీలు
- ఎన్నికల వేళ అంతా కన్‌ఫ్యూజన్

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీసు విభాగంలో ఇప్పుడు బదిలీల కాలం నడుస్తోంది. 'హస్తం' పాలనలో అంతా అస్తవ్యస్తంగా మారింది. కొందరు ప్రజాప్రతినిధుల తీరుతో సీనియర్ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బదిలీ ఉత్వర్వులు ఎప్పుడొచ్చి మీద పడతాయో, ఎక్కడికి వెళ్లాల్సి వస్తుందో తెలియక అయోమయంలో ఉన్నారు. ఒకరిద్దరు కాదు.. పదుల సంఖ్యలో అధికారులు ఇప్పుడీ పరిస్థితిని ఎదుర్కొంటుండడంతో పాలనా వ్యవస్థ కుంటుపడుతున్నది. ఏ అధికారి ఎప్పుడు వస్తాడో, ఎన్నాళ్లు ఉంటాడో తెలియక కింది స్థాయి అధికారులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టింది మొదలు ఒకరిద్దరు అధికారులు మినహా ఎవరూ కుదురుగా ఉండడం లేదు. రాష్ట్రంలో పోలీసుల బదిలీలు ప్రహసనంలా మారాయి.

90 రోజుల్లో మూడు బదిలీలు

సీనియర్ పోలీసు అధికారి జీ సుధీర్‌బాబు బదిలీల ఉదంతం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఎన్నికల సమయానికి సుధీర్‌బాబు హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో జాయింట్ పోలీసు కమిషనర్‌గా ఉండేవారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆయనను రాచకొండ పోలీస్ కమిషనర్‌గా నియమించింది. అక్కడే ఉన్న ఆయనను ఈ నెలలో హఠాత్తుగా బదిలీ చేసి మల్టీజోన్-1కు ఐజీ బాధ్యతలు అప్పగించింది. ఇప్పుడు మళ్లీ ఆ బాధ్యతల నుంచి తప్పించింది. పోస్టింగ్ ఇవ్వకుండా ఖాళీగా ఉంచారు.

- మరో సీనియర్ అధికారి ఏవీ రంగనాథ్ ఎన్నికల సమయంలో వరంగల్ పోలీసు కమిషనర్‌గా ఉండేవారు. నవంబర్‌లో ఆయనను ఎన్నికల సంఘం బదిలీ చేసింది. రిజర్వ్‌లో ఉన్న ఆయనను హైదరాబాద్ సిటీ క్రైంకు జాయింట్ పోలీసు కమిషనర్‌గా బదిలీ చేశారు. తాజాగా మల్టీ జోన్-1కు ఐజీగా బదిలీ చేశారు. అంటే గడిచిన నాలుగు నెలల్లో ఆయనను నాలుగుసార్లు బదిలీ చేశారు.
- సీనియర్ ఐపీఎస్ అధికారి విశ్వప్రసాద్ డిసెంబర్ నాటికి హైదరాబాద్‌లో స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ సీపీగా ఉండేవారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక ఆయనను హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ సీపీగా నియమించింది. తాజాగా ఇప్పుడు పోలీసు ఆర్గనైజేషన్స్‌కు బదిలీ చేసింది. మూడు నెలల్లో ఆయన మూడు బాధ్యతల్లో పనిచేశారు.
- ఐపీఎస్ అధికారి శరత్‌చంద్రపవార్ ఎన్నికలకు ముందువరకు మహబూబాబాద్ ఎస్పీగా పనిచేశారు. ఆ తర్వాత ఆయనను నగరంలోని సెంట్రల్ డీసీపీగా వేశారు. అక్కడ ఉన్న ఆయనను ఇప్పుడు నార్కోటిక్ బ్యూరోకు ఎస్పీగా మార్చారు.
- నాన్‌క్యాడర్ ఎస్పీగా ఉన్న సాయిశ్రీ డిసెంబర్‌లో ఎల్బీనగర్ డీసీపీగా ఉండేవారు. ఆ తర్వాత ఆమెను ఈస్ట్‌జోన్ డీసీపీగా మార్చారు. తాజాగా ఆమెను సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్ డీసీపీగా వేశారు. ఇలా చెప్పుకుంటూ వెళ్తే మరో అరడజను మంది ఇలా బదిలీ అయినవాళ్లున్నారు. ఐపీఎస్ అధికారి ఎల్ఎస్ చౌహాన్‌ను రామగుండం సీపీగా వేశారు. ఆయన అక్కడకు వెళ్లి బాధ్యతలు తీసుకోకముందే అక్కడి నుంచి మార్చి జోగులాంబ గద్వాలకు మార్చారు.

డీఎస్పీలకు నెలలోనే నాలుగేసి బదిలీలు

ఎక్కడైనా ఒక అధికారి బదిలీ అయి కొత్త పోస్టులో చేరితే అక్కడి నుంచి వెంటనే బదిలీ చేయడం అనేది దాదాపుగా ఉండదు. కానీ, పోలీసు శాఖలో మాత్రం చిత్రవిచిత్రాలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఆదినారాయణను పాల్వంచ డీఎస్పీగా బదిలీ చేశారు. అక్కడికి వెళ్లి ఎస్పీకి రిపోర్టు చేసి విధుల్లో చేరారు. చేరిన ఒక్క రోజు వ్యవధిలోనే బదిలీ అంటూ మరో ఉత్తర్వు వచ్చింది. ప్రశాంత్‌రెడ్డి అనే మరో డీఎస్పీ నెలలోనే అత్యధికంగా నాలుగు బదిలీ ఉత్తర్వులు అందుకున్నారు. చేవెళ్ల-ఐటీ సెల్-కాచిగూడ- సైబర్‌సెక్యూరిటీ.. ఇలా ఆయనకు ఉత్తర్వులపై ఉత్తర్వులు వచ్చాయి. సామల వెంకట్‌రెడ్డి అనే మరో డీఎస్పీ పరిస్థితి కూడా ఇంతే.. మేడ్చల్-సుల్తాన్‌బజార్-బంజారాహిల్స్‌కు వరుస బదిలీలు జరిగాయి. కేవీ సూర్యప్రకాశ్‌రావు అనే డీఎస్పీ కూడా నెలలో మూడు పోస్టింగ్‌లు చూశారు. ఇలా చెప్పుకుంటూ వెళ్తే పదుల సంఖ్యలో డీఎస్పీస్థాయి అధికారులున్నారు.

స్కీం స్కాంకు నలుగురు బలి

- ముగ్గురు కుమారులను చంపి.. తండ్రి ఆత్మహత్య
- జీఎస్ఎన్ ఫౌండేషన్ స్కీంలో రూ. రెండు కోట్లకుపైగా ప్రజలతో డిపాజిట్
- సంస్థ డబ్బులు చెల్లించకపోవడంతో ఏజెంట్‌పై పెరిగిన ఒత్తిడి
- రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం టంగటూరులో ఘటన

సాయికిరణ్, మోహిత్‌కుమార్, ఉదయ్‌కుమార్

శంకర్‌పల్లి, మార్చి 4 : ఓ ప్రైవేటు సంస్థలో ఏజెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి తన ముగ్గురు కుమారులతో సహా ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని టంగటూరు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం టంగటూర్‌కు చెందిన నీరటి రవికుమార్ అలియాస్ చిట్టి(35) ఏపీలోని విజయనగరం జిల్లా రాజాంకు చెందిన జీఎస్ఎస్ ఫౌండేషన్ సంస్థలో స్కీంల పేరిట వివిధ గ్రామాల్లో ప్రజల నుంచి డబ్బులు కట్టించాడు. రూ.1000 కడితే మూడు నెలల పాటు రూ.3000, రూ.లక్ష కడితే నెలకు రూ.50వేల చొప్పున 10 నెలల్లో రూ.5 లక్షలు వస్తాయని చెప్పడంతో చాలామంది స్కీం లో చేరారు. ఇలా దాదాపు రూ.2 కోట్లకు పైగా వసూలు చేసి డిపాజిట్ చేయించాడు. మొదట్లో క్రమం తప్పకుండా డబ్బులు చెల్లించిన సంస్థ మూడు నెలలుగా డబ్బులివ్వకపోవడంతో సంస్థలో చేరిన సభ్యులు రవికుమార్‌పై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో భార్య లత రవికుమార్‌తో గొడవ పడి చిన్నకొడుకును వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది.

ముగ్గురు కుమారులతో సహా తండ్రి ఆత్మహత్య

తీవ్ర మనస్తాపానికి గురైన రవికుమార్ ఆదివారం మొయినాబాద్ మండలం చిలుకూరులోని ఓ హాస్టల్‌లో చదువుతున్న తన ఇద్దరు కుమారులు సాయికిరణ్ (13), మోహిత్‌కుమార్(10)ను ఇంటికి తీసుకొచ్చి, చిన్న కుమారుడు ఉదయ్‌కుమార్ (7)కు సైతం ఇంట్లోనే నైలాన్ తాడు బిగించి హత్య చేశాడు. అనంతరం అతడు టంగటూరు శివారులో తాను నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్‌లో అర్ధరాత్రి ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్, సీఐ వీరబాబు తెలిపారు.